క్లుప్తంగా

అభాగ్యుడికి వాసుపల్లి ఆర్థిక ఆసరా



త్రినాథ్‌కు ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్. చిత్రంలో జాన్‌వెస్లీ తదితరులు

జగదాంబ: అనారోగ్యంతో బాధపడుతున్న లండా త్రినాథ్ అనే వ్యక్తికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం 35వ వార్డులో జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం అనంతరం త్రినాథ్ గురించి తెలుసుకున్న వాసుపల్లి వార్డు అధ్యక్షుడు కనకరెడ్డితో కలిసి వెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం త్రినాథ్‌కు సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సంపాదనలో సగం పేదలకు ఖర్చు చేయడం సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు బొల్లవరపు జాన్‌వెస్లీ, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువర్ణరాజు, మళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు కేంద్రమే నిధులివ్వాలి

దాబాగార్డెన్స్: విశాఖ, విజయవాడ నగరాల మెట్రో రైలు తొలి దశ నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలపడంపై సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు వ్యయం మొత్తం కేంద్ర ప్రభుత్వమే భరించాలని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. విశాఖ మెట్రో తొలి దశ 46 కిలోమీటర్లకు రూ.11,498 కోట్ల వ్యయం అవుతుందని, ఇందులో సగం ప్రభుత్వ జాయింట్ వెంచర్, ఈక్విటీ ఫండింగ్ ద్వారా చేపడతామని ప్రకటించడాన్ని జగ్గునాయుడు తప్పుబట్టారు. వీఎంఆర్డీఏకు రూ.4,101 కోట్లు సమకూర్చడానికి 1,944 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడం దారుణమన్నారు. ఇది రైతుల భూములు, ప్రభుత్వ భూములను బడా సంపన్నులకు కట్టబెట్టే ప్రయత్నమన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి మెట్రో వ్యయం మొత్తం కేంద్రమే భరించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

యువతకు సీపీఆర్‌పై శిక్షణ

దాబాగార్డెన్స్: రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ సహకారంతో ఏవీఎన్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. క్లబ్ గ్రేటర్ విశాఖ అధ్యక్షుడు చింతా నేతాజీ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అత్యవసర పరిస్థితిలో శ్వాస ఆడక.. గుండె ఆగి సొమ్మసిల్లి పడిపోయిన వ్యక్తికి కార్డియో పల్మోనరీ రెసిటేషన్ (సీపీఆర్) ద్వారా పునర్జీవనం అందించవచ్చని ప్రాక్టికల్‌గా చూపించారు. రోటరీ క్లబ్ కమ్యూనిటీ సర్వీసెస్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ దేవరకొండ, డాక్టర్ జి.అర్జున్ విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, కిషోర్‌కుమార్, జీకే మూర్తి, డాక్టర్ రాజశేఖర్, ఆర్‌టీఎన్ శంకర్, రాజశేఖర్, గణేష్, నరేష్ సప్పా, ఎస్.ఎస్.రాజు, సురేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, రోటరాక్ట్ చైర్మన్ ఎస్.కృష్ణకుమారి, ఎం.స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ ఎ.అర్చన, ఎం.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

విశాఖ లీగల్: ముక్కపచ్చలారని బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి పి.మంగా కుమారి శుక్రవారం తీర్పు ఇచ్చారు. నిందితుడు రూ. 75 వేలు జరిమానా చెల్లించాలని, అలాగే మరొక రూ. 25 వేలు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల పరిహారం చెల్లించాలని కూడా న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిన రాజశేఖర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు కుర్ర రంజిత్ కుమార్(17) ఉమ్మడి విశాఖ జిల్లా పెదబయలు మండలం చిన్నవీధి గ్రామానికి చెందినవాడు. బాలిక వయస్సు అప్పుడు కేవలం మూడేళ్లు. 2020 అక్టోబర్ 13వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేని స్థితిలో రంజిత్ కుమార్ బాలికను అపహరించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తండ్రి కృష్ణారావు ఫిర్యాదు మేరకు పాడేరు డీఎస్పీ కేసు నమోదు చేసి నిందితునిపై సెక్షన్ 376ఏ,బీ161(3), పోక్సో చట్టం సెక్షన్ 5,6 కింద కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. కేసు కీలకంగా మారడంతో బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించినా చాలా రోజులు వైద్యుల పర్యవేక్షణలోనే ఉంచారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బీవీ రాజ్‌కుమార్ కేసును దర్యాప్తు చేసి సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

నడక దారుణాలు



పూర్ణామార్కెట్ దరి ఏవీఎన్ కళాశాల డౌన్ వరకు కనిపించని ఫుట్‌పాత్



దుర్గాలమ్మ గుడి జంక్షన్ నుంచి మేదర వీధి వరకు ఆక్రమణలో ఉన్న ఫుట్‌పాత్

- చిరు వ్యాపారుల ఆక్రమణలో ఫుట్‌పాత్‌లు
- ఇక్కట్లలో పాదచారులు
- ప్రమాదాలకు గురవుతున్న వైనం
- స్పందించని సంబంధిత అధికారులు



రోడ్డుతో పాటు ఫుట్‌పాత్‌ను మింగేసిన జనతాబజార్ స్క్రాప్ షాపులు



వన్‌టౌన్ రహదారిలో..

జగదాంబ: పూర్ణామార్కెట్‌లోని ఫుట్‌పాత్‌లు వ్యాపారుల ఆక్రమణలతో నడిచే వీలు లేక పాదచారులు అవస్థలు పడుతున్నారు. పాతనగరంలో జగదాంబ నుంచి వన్‌టౌన్ వరకు రద్దీగా ఉంటుందని జీవీఎంసీ **ప్రజల సౌకర్యార్థం ఫుట్‌పాత్‌లు నిర్మించింది.**



పందుపుల్లల సందులో..

కానీ అవి పాదచారుల కంటే వ్యాపారులకే ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి. జగదాంబ దరి దసపల్లా, టర్నర్ చౌల్ట్రీ తదితర ప్రాంతాల్లో రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు కనీసం నడవడానికి కూడా వీల్లేని విధంగా ఉన్నాయి. చిరు వ్యాపారులు దుకాణాలు పెట్టుకుని దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. అలాగే పూర్ణామార్కెట్, వన్‌టౌన్‌కు వెళ్లే దారి, స్ప్రింగ్‌రోడ్డు, మంచాల వీధి, వెలంపేట, దుర్గాలమ్మ గుడి జంక్షన్, పందుపుల్లల సందు, జనతా బజార్ వద్ద కనీసం ఫుట్‌పాత్‌లు కూడా కనిపించనంతగా వ్యాపారులు ఆక్రమించుకున్నారు.

వ్యాపారుల ఆక్రమణతో కనిపించని ఫుట్‌పాత్‌లు ఇవే..

- పోర్టు ముఖద్వారం నుంచి జనతాబజార్, డాల్ఫిన్ హోటల్ వరకు
- జగదాంబ, టర్నర్ చౌల్ట్రీ, వన్‌టౌన్ ప్రధాన రహదారి, ఏవీఎన్ కళాశాల డౌన్ రోడ్డుకు ఇరువైపులా
- మేదర వీధి, మంచాల వీధి, దుర్గాలమ్మ గుడి జంక్షన్ నుంచి కల్లుపాకలు, స్ప్రింగ్‌రోడ్డు, పోలీసు బ్యారెక్స్ వరకు
- పూర్ణామార్కెట్ నుంచి బౌడారా రోడ్డు, రామకృష్ణా జంక్షన్ మీదుగా మజీద్ వరకు
- రామకృష్ణా జంక్షన్ ఉంచి 75 ఫీట్‌రోడ్డు మొత్తం
- పందుపుల్లల సందు



మంచాలవీధిలో..

పట్టించుకోని అధికారులు..

నిత్యం రద్దీగా ఉండే పూర్ణామార్కెట్‌లో ట్రాఫిక్ పోలీసులు చలానాలు రాసుకోవడానికే ఆసక్తి చూపుతున్నారు కానీ ట్రాఫిక్ నియంత్రణ, ఫుట్‌పాత్‌ల నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదని పాదచారులు, వాహన చోదకులు వాపోతున్నారు. దీనివల్ల ఫుట్‌పాత్‌లపై వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటున్నారు. పాదచారులే కాకుండా పూర్ణామార్కెట్‌లో కొనుగోళ్లకు వస్తున్న వినియోగదారులకు కూడా నడిచే దారి ఇవ్వకపోవడంతో అటుగా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందంటున్నారు. దీని వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపిస్తున్నారు. పందుపుల్లల సందు, దుర్గాలమ్మ గుడి జంక్షన్ నుంచి మేదరవీధి, మంచాల వీధి ప్రాంతాలు మరింత దారుణంగా ఉంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులు మూడు, నాలుగు గ్రూప్‌లుగా ఏర్పడి హెల్మెట్ కేసులపై మాత్రమే శ్రద్ధ చూపిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం



జాలరిపేటలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జబ్బర్‌తోట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు ప్రాంతాలను శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. బీచ్ రోడ్డు, జాలరిపేట, నేవల్ క్యాంటీన్ ఏరియాల్లో జరుగుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఇతర పథకాల గురించి స్థానికులకు వివరించారు. డయాగ్నోస్టిక్ సేవలు, మందుల వినియోగం, కాంప్రహెన్సివ్ స్క్రీనింగ్, రిఫరల్ సేవల గురించి అక్కడి వైద్యులు, సిబ్బందికి వివరించారు. అభ ఐడీ మ్యాపింగ్ శతశాతం సాధించాలని ఆదేశించారు. వ్యాధుల నివారణకు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

మహారాణిపేట: జిల్లా పరిషత్ వద్ద ఉన్న కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ మీటింగ్ హాల్లో కోఆపరేటివ్ డిపార్టుమెంటు సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి టి.ప్రవీణ సమాచార హక్కు చట్టం–2005 ప్రాథమిక లక్ష్యాలు, సమాచార అధికారుల విధులు తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ డివిజనల్ అధికారి కిరణ్‌కుమారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.సత్యశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ



విశేష అలంకరణలో ఉమాదేవి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో అలివేలు మంగమ్మ



విశేష అలంకరణలో సాగరగిరి కనకదుర్గమ్మ

అల్లిపురం: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా దేవాలయాలు శ్రావణ శోభ సంతరించుకున్నాయి. టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన ఉమాదేవి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని కనకాంబరాలు, జాజులతో ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి ఆలయ అర్చకుడు జోగారావుశర్మ విశేష పూజలు జరిపారు. అల్లిపురం శ్రీ అలివేలు మంగమ్మ ఆలయం, మూడుగుళ్ల కనకదుర్గమ్మ ఆలయం, కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం, జెండా చెట్టువీధిలోని విజయ దుర్గాలమ్మ, యారాడ కొండపై వెలసిన సాగరగిరి కనకదుర్గమ్మ ఆలయంలో తెల్లవారు జాము నుంచి విశేష పూజలు జరిగాయి. శ్రావణమాసం మొదటి శుక్రవారం కావటంతో మహిళలు ఘనంగా పూజలు చేశారు.

కూటమి నాయకులను నిలదీయండి



బౌడారా రోడ్డులో మహిళకు బాబు మోసాలు వివరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్. చిత్రంలో జాన్‌వెస్లీ తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న వాసుపల్లి

- మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి
- 35వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం

జగదాంబ: మీ ప్రాంతాలకు కూటమి నాయకులు వస్తే ఇచ్చిన హామీలు అమలు చేయాలని నిలదీయండంటూ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 35వ వార్డులోని పండావీధిలో వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వాసుపల్లి ముందుగా దుర్గాలమ్మ ఆలయంలో పూజలు చేశారు. తర్వాత వార్డులోని బౌడారా రోడ్డులోని సభా ప్రాంగణానికి వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 5 వేలు జీతం తీసుకునే వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని చెప్పి తర్వాత వారి ఉద్యోగాలు తీసేశారన్నారు. ఇంటి వద్దకు వచ్చే రేషన్ బండిని తీసేసి ఆడవాళ్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన వాళ్లందరికీ నెలకు రూ. 1500 ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలని అంటున్నారని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ నీ సినిమా టిక్కెట్ ధర రూ. 700 వందలు పెట్టుకున్నావ్.. ఏముంది ఆ సినిమాలో అని వాసుపల్లి ప్రశ్నించారు. హిందూ, ముస్లింలకు తగాదాలు పెట్టడానికే సినిమా తీశావా? అన్నారు. నీకు దమ్ముంటే నీ అభిమానులకు మొదటి రెండు, మూడు రోజులు సినిమాను ఉచితంగా చూపించు అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌గా కనకరెడ్డిని గెలిపించుకుని కౌన్సిల్‌కు పంపించే బాధ్యత నామీద, స్థానికులైన మీ మీద ఉందని ప్రజలతో అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు బొల్లవరపు జాన్‌వెస్లీ, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువర్ణరాజు, పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు జీరు సూర్యనారాయణ (సుధ), గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మళ్ల బుజ్జి, దుర్గాలమ్మ ఆలయం మాజీ చైర్మన్ నాయిని మల్లిబాబు, కర్రిరాము, నాయిని తమ్మన్న, నాయిని రమేష్, నాయిని శ్రీను, గిడ్డ శ్రీనివాసరావు, లండా సుధ, నగేష్, పెద్ద రమణ, మాలిబాబు, సంతోష్, అలపన రమణమ్మ, బత్తులరాము, పి.రమణమ్మ, వై. రమణమ్మ, పుష్ప, కనకమ్మ, రమ్య, దాలమ్మ, రేవతి, ఉమ, లక్ష్మణ్, రవి, దుర్గాప్రసాద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'అన్యాయంగా భూమి రిజిస్ట్రేషన్ రద్దు చేశారు'



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు సత్యనారాయణమూర్తి

దాబాగార్డెన్స్: అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం గంటి కొర్లం ప్రాంతంలో తనకు చెందిన ఎకరా 54 సెంట్ల భూమిని తనకు తెలియకుండా విజయనగరం జిల్లా పాలకొండ సబ్ రిజిస్ట్రార్ అన్యాయంగా రిజిస్ట్రేషన్ రద్దు చేశారని బాధితుడు గంప సత్యనారాయణమూర్తి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తన అనుమతి లేకుండా విజయనగరం జిల్లా పాలకొండ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి బొల్లాప్రగడ వెంకటరమణమూర్తి అనే వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తెలిపారు. సుమారు పదేళ్ల కిందట తన బావమరిది బొల్లాప్రగడ వెంకటరమణమూర్తి తన పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేశాడని తెలిపారు. అయితే ఇటీవల చెప్పుడు మాటలు విని తనను అకారణంగా ద్వేషిస్తూ తనపై ఫిర్యాదులు చేస్తున్నారని, ఇదే విషయంలో జనసేన నాయకునిగా చెప్పుకు తిరుగుతున్న అడ్డుపల్లి గణేష్ గత మే 29న తన భూమిలోకి 50 మందితో కలిసి వచ్చి తనను చంపేస్తామని, భూమి తనకు వదిలేసి వెళ్లిపోవాలని హెచ్చరించి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు తనపై తప్పుడు ఫిర్యాదులు చేసి తనను, తన కుటుంబ సభ్యులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. అడ్డుపల్లి గణేష్ నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహానీ ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ కల్పించాలని కోరారు. పాలకొండ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకుని, అన్యాయంగా రద్దు చేసిన తన భూమిని తనకు తిరిగి రిజిస్ట్రేషన్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో గంప గోవిందరాజు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇళ్లకు రేషన్ సరుకులు

మహారాణిపేట: జిల్లాలో శనివారం నుంచి వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు పీడీఎస్ సరుకులు పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లాలో 33,666 మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారన్నారు.

ఎస్.కోట అసెంబ్లీని విశాఖ జిల్లాలో విలీనం చేయాలి

మహారాణిపేట: విశాఖ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలోకి తీసుకు రావాలని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్. సత్తిబాబు కోరారు. శుక్రవారం విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గాన్ని విశాఖలో విలీనం చేయాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో యు. కూర్మారావు, సీతారామరాజు, మూర్తి ఉన్నారు.

విశాఖ డెయిరీ ఉద్యోగుల తొలగింపు అన్యాయం



ర్యాలీ నిర్వహిస్తున్న విశాఖ డెయిరీ కాంట్రాక్టు కార్మికులు

బీచ్‌రోడ్డు: విశాఖ డెయిరీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను ఏ విధమైన నోటీసులు లేకుండా యాజమాన్యం జూన్ 10వ తేదీన అన్యాయంగా తొలగించిందని, వీరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద డెయిరీ కాంట్రాక్ట్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ముందుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం నుండి భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా యూనియన్ పెట్టుకున్నారనే నెపంతో విశాఖ డెయిరీ యాజమాన్యం 300 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం దుర్మార్గమన్నారు. దీనిపై జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అందరినీ విధుల్లోకి తీసుకోమని ఆదేశించారన్నారు. కానీ 15 సంవత్సరాల పైబడి పని చేస్తున్న వీరందరినీ యాజమాన్యం విధుల నుండి తొలగించిందన్నారు. యాజమాన్యం గనుక తన వైఖరి మార్చుకోకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ ధర్నాలో సీఐటీయూ గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి, ఎ. నూకేశ్వరరావు, ఎం. రాంబాబు, డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ. రమణ, అనసూయ, పద్మజ, మధుబాబు, నాగేశ్వరరావు, పెద్ద ఎత్తున కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

సీతమ్మధార ట్రెజరీలో తప్పుడు బిల్లుల బాగోతం

ఎస్‌టీవో ప్రమేయం లేకుండా బిల్లులు సిఫారసు చేస్తున్న ట్రెజరీ ఉన్నతాధికారి

మహారాణిపేట: సీతమ్మధార సబ్ ట్రెజరీ కార్యాలయం అక్రమాలకు నిలయంగా మారిందని జోరుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ అనేక కుంభకోణాలు, దొంగ బిల్లుల చెల్లింపు, ఉద్యోగులపై సస్పెన్షన్ వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. అయినా ఇక్కడి అధికారులు, సిబ్బందిలో ఎలాంటి మార్పు లేదు. ఇప్పుడు ఇదే కార్యాలయం నుంచి తప్పుడు బిల్లుల సిఫారసులు జోరుగా సాగుతున్నాయి. ఈ కార్యాలయంలో సంబంధిత సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీవో) ప్రమేయం లేకుండా అనేక బిల్లులకు సిఫార్సులు చేయడం విశేషం. దీర్ఘకాలికంగా సెలవులో ఉన్న జిల్లా ట్రెజరీ అధికారి వై.సుధాకరరావు విధుల్లో చేరిన తర్వాత ప్రీ ఆడిట్ బిల్లుల పరిశీలనలో ఒక బిల్లు నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో దాన్ని వెనక్కి తిప్పి పంపారు. వివరాలు ఇవి.. ప్రభుత్వ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్న జి.ఈశ్వర వర్మ 1994 డిసెంబర్ 31వ తేదీన రిటైర్ అయ్యారు. ఇతను 2015 డిసెంబర్ 27వ తేదీన చనిపోయారు. తర్వాత సర్వీస్ పెన్షన్, ఇతర అరియర్స్, డీఏతో కలుపుకుని మొత్తం రూ.36 లక్షల వస్తాయని లెక్కలు వేశారు. కొన్ని బిల్లుల చెల్లింపునకు అర్హత లేకపోయినా చెల్లించడానికి పెద్ద మొత్తంలో బేరం కుదుర్చుకుని సీతమ్మధార సబ్ ట్రెజరీ కార్యాలయంలో బిల్లులు సిద్ధం చేశారు. సీనియర్ అకౌంటెంట్ ఈ మొత్తం ప్రక్రియను తయారు చేసి సిఫారసు చేశారు. సంబంధిత ఎస్‌టీవోకు ప్రమేయం లేకుండా సంబంధిత కార్యాలయం అసిస్టెంట్ ట్రెజరీ అధికారి సంతకం చేశారు. అప్పటి ఇన్‌చార్జి డీటీవోగా కూడా ఇక్కడ అసిస్టెంట్ ట్రెజరీ అధికారి పని చేశారు. ఇంతలో సెలవు పూర్తి కావడంతో జిల్లా ట్రెజరీ అధికారి (డీటీవో) వై.సుధాకరరావు విధుల్లో చేరారు. అనేక ఆరోపణలు రావడంతో ప్రీ ఆడిట్‌లో బిల్లులను క్షుణంగా పరిశీలించారు. ఇందులో ఈశ్వర వర్మ ఫ్యామిలీ పెన్షన్ వ్యవహారం బయట పడింది. ఈ బిల్లు అంతా తప్పుల తడకగా ఉన్నట్లు గమనించి బిల్లులను డీటీవో సుధాకరరావు వెనక్కి పంపారు. ఆ ఫ్యామిలీకి లేనిపోని ఆశలు కల్పించి వారితో లాలూచీ పడినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పుడు ఈ బిల్లు వెనక్కి రావడంతో ముందుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని వారు కోరారు. మళ్లీ తాను త్వరలో ఇన్‌చార్జి డీటీవోగా వస్తానని, అప్పుడు పూర్తి చేస్తామని వారికి నమ్మబలుకుతున్నట్టు సమాచారం.

ధర్మస్థలి దోషులను కఠినంగా శిక్షించాలి

బీచ్‌రోడ్డు: కర్ణాటక ధర్మస్థలి ఆలయంలో 1995 నుండి 2014 వరకు అనేక మందిని అత్యాచారం, హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ పీవోడబ్ల్యు, ఎస్‌ఎఫ్‌డబ్ల్యు నాయకులు శుక్రవారం గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షులు ఎం. లక్ష్మి మాట్లాడుతూ దోషులు డబ్బు, పలుకుబడి గల వ్యక్తి కావడంతో ఎన్ని ప్రభుత్వాలు మారినా అందరినీ మేనేజ్ చేసి నేరం బయటికి రాకుండా అడ్డుకున్నారని అన్నారు. ఇప్పుడు నేరం బయట పడి ఎఫ్ఐఆర్ నమోదు చేసినా విచారణ నత్తనడకన సాగుతుందన్నారు. ఇటువంటి ఆరోపణలు ఇప్పుడు కొత్తగా వచ్చినవి కాదని, గతంలో కూడా వచ్చినా వాస్తవాలు బయటికి రాకుండా అడ్డుకున్నారని అన్నారు. ఇప్పటికే కాలాతీతం అయిందని, ఇప్పటికైనా జుడీషియరీ ఎంక్వైరీ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. విమల తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో ఈగల్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఈగల్ డిపార్ట్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ టి.కల్యాణి పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం.. విలువైన ప్రాణాన్ని కాపాడుకుందాం అంటూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, అధ్యాపకురాలు ఎం.లావణ్య పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు విలువైన పరికరాల అందజేత



కేజీహెచ్‌కు విలువైన పరికరాలు అందజేస్తున్న ఈసై ఫార్మా స్యూటికల్స్ సంస్థ ప్రతినిధులు

మహారాణిపేట: ఈసై ఫార్మాస్యూటికల్స్ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.14 లక్షల విలువైన పరికరాలను కేజీహెచ్ శిశు శస్త్ర చికిత్స విభాగానికి అందజేసింది. శుక్రవారం కంపెనీ ప్రతినిధులు జోసెఫ్, మదన్‌మోహన్ తదితరులు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి సమక్షంలో ఈ పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్, ప్రొఫెసర్ జె.భాస్కరరెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.రాధాకృష్ణ, డాక్టర్ వి.రవి, డాక్టర్ జి.వాసవీలత, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి, శిశు చికిత్సా విభాగం వైద్యులు డాక్టర్ హసంతి, డాక్టర్ కళ్యాణ్ రవి ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ చైతన్య, పీజీలు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.